డాక్టర్ లక్ష్మీప్రసాద్‌కు సన్మానం

లక్ష్మి ప్రసాద్‌ను సత్కరిస్తున్న వడ్డెర ఫోరం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఏక గ్రీవంగా ఎన్నికైన ప్రముఖ వైద్యుడు సీనియర్ సివిల్ సర్జన్ దేరంగుల లక్ష్మీప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో ఎ.పి వడ్డెర మేధావుల ఫోరం కన్వీనర్ కె.జీవానందం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు దేరంగుల సిద్దు సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఉన్నతాధికారులుగా సమర్థవంతమైన బడుగు, బలహీన, అణగారి నవర్గాల బిడ్డలుండడం గర్వకార ణమని అన్నారు. లక్ష్మీప్రసాద్‌లోని నాయకత్వ లక్షణాలను గుర్తించి అన్నమయ్యజిల్లా ప్రభుత్వ ఉద్యో గులసంఘం అధ్యక్షులుగా నియమించిన ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకత్వానికి ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథ నాయక్, వడ్డెర మేధావుల ఫోరం ఎన్ఆర్ఐ విభాగం ఉపాధ్యక్షుడు నంద్యాల వెంకటరమణ, టిడిపి ఎస్‌టి సెల్ అధ్య క్షులు రెడ్డీనాయక్ పాల్గొన్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో

ఘోర రోడ్డు ప్రమాదం

- కారుపై పడిన లారీ.. నలుగురు దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- చింతపుత్తాయపల్లెలో విషాద ఛాయలు
- రోడ్డు ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

మృతులు నాగిరెడ్డి, శిరీష, హర్షిత, రిషికేశ్‌రెడ్డి

కారులో ఇరుకున్న మృతదేహాలను తీస్తున్న జెసిబి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె/బద్వేలు

కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్‌లోని నాలుగో మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే...శనివారం ఉదయం 10 గంటల సమయాన బెంగళూరు నుండి కారులో బద్వేలు నియోజకవర్గంలోని చింతపుత్తాయపల్లె వెళు తుండగా తమిళనాడులోని లిల్లీపురం నుండి హైదరాబాదుకు చక్కెర లోడుతో వెళులతున్న లారీకి బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి సైడ్ వస్తున్న కారు పైన పడింది. లారీ ఇంజన్, లారీలో ఉన్న చెక్కర మూటలు పడటంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బసినేని శ్రీకాంత్‌రెడ్డి(32), అతని భార్య నాగిరెడ్డి శిరీష(27), వారితోపాటు శిరీష అక్క కుమార్తె, కుమారుడు హర్షితరెడ్డి(9), రిషికేశ్‌రెడ్డి(11)లో కూడా ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. వీరితోపాటు శ్రీకాంత్‌రెడ్డి కుమార్తె త్రిషికారెడ్డి (3), కోవటం శశికళ, సిద్ధమూర్తి స్వర్ణలత తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం వల్ల ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు సుమారు రెండు గంటలకుపైగా అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న చింతకొమ్మదిన్నె పోలీసులు జెసిబి సహాయంతో దాదాపు ఒకటిన్నర గంట సేపు శ్రమించి నుజ్జునుజ్జయిన కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీశారు. వారిని 108 అంబులెన్స్ ద్వారా రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతపుత్తాయపల్లెలో విషాద ఛాయలు

బద్వేలు నియోజకవర్గంలోని చింతపుతాయపల్లె గ్రామంలో

రిమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న బద్వేలు ఎమ్మెల్యే సుధా

సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం 41 రోజు పూర్తి కావడంతో గ్రామ మంతా జాతర జరుపుకోవడానికి సిద్ధమైంది. చింతపుత్తాయపల్లి గ్రామంలో ఏ చిన్న కార్యక్రమం జరిగిన శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ఎంతో సందడి చేసే వారు. ఈ రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబంతో మృతి చెందడంతో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి లోనయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి కుటుంబం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దాసరి సుధ హుటా హుటిన కడప రిమ్స్ దగ్గరకు వెళ్ళి గాయమైన వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్స్‌కు సూచించారు. అనంతరం మార్చురీకి వెళ్ళి వారి భౌతికాయాలను సందర్శించి వెంటనే పోస్టు మార్టం చేయాలని డాక్టర్స్‌కు సూచించారు. అనంతరం పోలీసులతో మాట్లాడి వెంటనే కేసు నమోదు చేయాలని సూచించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ జడ్‌పిటిసి పోలిరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, బి.కోడూరు ఎంపిపి శేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు లక్ష్మి నరసారెడ్డి, రోసిరెడ్డి, జయరామిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి నాయకులు రితీష్‌రెడ్డి పరామర్శ

బద్వేల్ నియోజకవర్గం చింతపుతాయపల్లె గ్రామానికి చెందిన వాసులు గువ్వలచెరువు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే బద్వేల్ నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డి కడప రిమ్స్‌లో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడి నుంచే కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వారికి తక్షణమే గాయపడిన వారికి మంచి వైద్యాన్ని అందించాలన్నారు. పరామర్శించిన వారిలో జిల్లా డిసిసి బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందడంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘాట్ రోడ్డులో లారీ, కారు ఢీకొన్న ఘటన బాధాకరమన్నారు. నలుగురు మృతి చెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రోడ్డు ప్రమాదాలు తీరని విషాదాన్ని నింపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రయాణాలలో భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు.

చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

- రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సాయం
- ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం మంజూరు
- చిన్నారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ పరామర్శ

చిన్నారి తల్లితో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

చిన్నారి మరణం చాలా బాధాకరం, నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారిని హత్య చేయడం మనసును కలిసివేసిందన్నారు. బాధాకరమైన సంఘటన్నారు. సమా జంలో మార్పు రావాలని తెలిపారు. ఎవరు కూడా ఇలాంటి ఆలోచన చేయ రాదన్నారు. చట్టప్రకారం ఏం చేయాలో అది చేస్తామన్నారు. నిందితుడికి అన్ని రకాలుగా పూర్తిగా శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. చిన్నారి కుటుంబానికి ఉద్యోగం, ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేస్తున్నా మన్నారు. తక్షణ సాయం కింద రూ.ఐదు లక్షలు అందజేసి, ఎఫ్ఐఆర్ మేరకు మిగతా పరిహారం వెల్లడిస్తామన్నారు. చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీ, డిఎస్‌పి వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నిందితుడి ఇల్లు నేలమట్టం : గ్రామంలో ఇలాంటి వ్యక్తి ఉండరాదంటూ గ్రామస్తులు జెసిబితో నిందితుడు దూదేకుల రహమతుల్లా ఇంటిని నేలమట్టం చేశారు. నిందితుడి మోరగుడి గ్రామం. తల్లి కువైట్‌లో ఉంది. నిందితుడు తాగుడుకు బానిసై సైకోలా ప్రవర్తిస్తాడాని స్థానికులు చెబుతున్నారు.

ప్రజా సంఘాల నిరసన : కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, దళిత సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు చిన్నారికి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని శిక్షించాలంటూ స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నాకు దిగారు. ఆస్పత్రి వద్ద ఉన్న కలెక్టర్‌ను నాయకులు కలిసి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివ మోహన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటస్వామి, ప్రకాశం, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, సిపిఐ నాయకులు మిడుతూరు ప్రసాద్, దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కోలా ప్రసాద్ పాల్గొన్నారు. మాన వ మృగాన్ని కఠినంగా శిక్షించాలని జనసేన కో-ఆర్డినేటర్ నాగార్జున అన్నారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి : ఆవాజ్

బద్వేలు: మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్ బాషా, బద్వేల్ కమిటీ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ సత్తార్ డిమాండ్ చేశారు. చిన్నారి తల్లిదండ్రులకు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. హోం మంత్రి, ప్రభుత్వం చిన్నారి తల్లిదండ్రులకు అండగా ఉండాలన్నారు. వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.బి.రసూల్, ఎస్.ఖాజ గౌస్, మస్తాన్, అన్వర్, నాగూర్ పాల్గొన్నారు.

పిల్లలు, మహిళలకు రక్షణలేదు : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : సభ్య సమాజం తలదించుకునే విధంగా కంబాలదిన్నెలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు, పసి పిల్లలకు, మహిళలకు ఇంట్లో, బయట, గుడిలో, బడిలో ఎక్కడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు కాలయాపన లేకుండా తక్షణమే శిక్షలు కఠినంగా అమలు జరిగినప్పుడే ఇంకొకసారి పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రబ్బా నరసింహులు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆది పాల్గొన్నారు.

కామాంధుడిని ఉరి తీయాలి : విద్యార్థి సంఘాలు

ప్రొద్దుటూరు : నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని ఉరి తీయాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య, ఎన్‌డిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కత్తి ఓబులేసు, రమేష్, బయన్న మాట్లాడుతూ నాలుగేళ్ల చిన్నారిని మోరగుడికి చెందిన రహమతుల్లా అనే వ్యక్తి దారుణంగా, కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన జుగుప్సాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణం సహాయం అందించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలోనాయకులు పవన్,చందు, రాజేష్ పాల్గొన్నారు.

మానవమృగాన్ని శిక్షించాలి : ఐద్వా

చిన్నారిని చిత్రహింసల పాలు చేసి హత్య చేసిన మానవ మృగాన్ని శిక్షించాలని ఐద్వా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ అధ్యక్షులు సర్వేశ్వరి అన్నారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పసికందును చిత్రహింసల పాలు చేసి హత్య చేయడం దుర్మార్గమని తెలిపారు. సమావేశంలో ఐద్వా నాయకులు నాగలక్ష్మి, కరీమున్, మౌనిక, వైష్ణవి పాల్గొన్నారు.

బాలిక మృతి బాధాకరం : కాంగ్రెస్

చిన్నారి అత్యాచార ఘటన చాలా బాధకరమని కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు సమన్వయ కర్త ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి

కడప : చిన్నారి హత్యాచార ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిపై నిందితుడు రహమతుల్లా మృగంలా ప్రవర్తించడం దారుణమన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అశోక్ కుమార్‌కు ఫోన్లో ఆదేశించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపిన మంత్రి, ప్రభుత్వపరంగా అండగా ఉంటామన్నారు. క్షమించరాని నేరం చేసిన నిందితుడు రహమతుల్లాను చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. భవిష్యత్తులో మరెవరైనా మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తించకుండా ఉండేలా కఠినకంగా వ్యవహరిస్తామన్నారు.

బాధిత చిన్నారికి న్యాయం జరగాలి : డిసిసి

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన మూర్ఖపు కామాంధుడిని కఠినంగా శిక్షించాలని డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి పేర్కొన్నారు. బాధిత చిన్నారికి న్యాయం జరగాలన్నారు. ఇలాంటి పాశవిక చర్యలు మన సమాజాన్ని కలచివేస్తున్నాయని, చిన్నారులపై ఇలాంటి నరమృగాలు చేస్తున్న అఘాయిత్యాలను తక్షణమే ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధిలో రాజీలేదు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీనాథ్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మినీ మహానాడు కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,12,000 టిడిపి సభ్యత్వాలు ఉంటే నియోజకవర్గం 37వ స్థానంలో నిలబెట్టిన ఘనత కార్యకర్తలకు మీకే దక్కిందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో ఏ పల్లెలో అయినా నీటి సమస్య ఉన్నదంటే తొమ్మిది మాసాలలో 300 బోర్లు వేసామని, ఆరు మండలాలకు రూ.22కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సాగునీరు,తాగునీరు అందిస్తామని అన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి సిఎం చంద్రబాబు రూ.300కోట్లు నిధులు మంజూరు చేశారని, జూన్ మాసం నుంచే పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 2029 ఎన్నికల వరకు తాను రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉంటానని తనకు అధిష్టానం టికెట్ ఇచ్చిన ఇవ్వకపో యినా టిడిపి పార్టీలోనే ఉండి పోతానని పేర్కొన్నారు. రాష్ట్రానికి రోడ్లకు రూ.1100 కోట్లు నిధులు మంజూరు అయితే నియోజకవర్గానికి రూ.600 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16,400 టీచర్ పోస్టులను డిఎస్‌సి నోటిఫి కేషన్ విడుదల చేయగా అందులో నియోజకవర్గానికి 150 ప్రభుత్వ టీచర్ పోస్టులు పొందే అవకాశం సిఎం కల్పించారని అన్నారు. 27 నుంచి 29వ తేదీ జరిగే మహానాడులో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, మండిపల్లి రాహుల్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు మందపాటి. రవీంద్ర బాబు, మాజీ ఎంపిపి ఆవుల. వెంకట్ నారాయణ రెడ్డి, మల్లు నర్సారెడ్డి, సుధాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ బి.కెమహమ్మద్ రియాజ్, సర్పంచ్ పార్థసారధిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి : డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉద్యాన డిప్లమో, పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ కోర్సులలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణలై లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. డాక్టర్ వెయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్లోడ్ చేసుకుని, దరఖాస్తు ఫారంను నింపి అవసరమైన సర్టిఫికెట్ కాపీలను జత చేసి రిజిస్టర్ డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకట రామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఉద్యానరంగం అభివృద్ధి జరుగుతున్న దృష్ట్యా డిప్లమా కోర్సుల ద్వారా నైపుణ్యత పొందిన విద్యార్థులకు భవిష్యత్తులో అనేక ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కలుగుతాయని అన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

-మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని విద్యార్థులందరూ కలిసి కట్టుగా, ఐక్యంగా పోరాడి కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్‌రావు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక విశ్వం విద్యాసంస్థలలో జరుగుతున్న విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిములకు ఖురాన్, హిందువులకు భగవద్గీత, క్రైస్తవులకు బైబిల్ ఎంత పవిత్రమైనదో భారతీయులకు రాజ్యాంగం అంతే పవిత్రమైనదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలు భారత రాజ్యాం గానికి తూట్లు పొడిచే విధంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం అయిన భారత రాజ్యాంగాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే మారుస్తామని బిజెపి ప్రభుత్వం కూసిన కారు కోతలను ప్రజలందరూ వ్యతిరేకించి, గత లోక్ సభ ఎన్నికల్లో మెజారిటీ తగ్గించి తగిన బుద్ధి చెప్పారన్నారు. ప్రధానంగా రాజ్యాంగ పీఠికలో పొందుపరిచినట్టు సర్వసత్తాక, సామ్యవాద, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మన దేశాన్ని ప్రకటించుకున్నామని, కానీ నేడు ప్రభుత్వం ఆ విధానాల్ని నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాఖ్య విధానాన్ని నాశనం చేసే విధంగా తమిళనాడు, కేరళ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయానికి భిన్నంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నాయని ఇది కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో కేంద్ర ప్రభుత్వ జోక్యం చేసుకోవడమే నని విమర్శించారు. శాసనసభలు రూపొందించిన చట్టాలను గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించకుండా ఆలస్యం చేయడమే దీనికి సంకేతమన్నారు. ఫెడరలిజంను కాపాడాలని సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టని తెలిపారు. లౌకికత్వానికి తూట్లు పొడిచే విధంగా విద్యలో కాషాయీకరణను బిజెపి ప్రభుత్వం తీసుకొస్తోందని దుయ్యబట్టారు. కర్ణాటకలో భగత్ సింగ్ చరిత్రను తొలగించి సావర్కర్ చరిత్రను పెట్టడాన్ని ఉదాహరణ అని తెలిపారు. ఎన్ఎస్ఆర్‌టి సిలబస్‌లో ఆర్ఎస్ఎస్, బిజెపిల జోక్యం నివారించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు శాస్త్రీయబద్ధమైన విద్య అందించాల్సింది పోయి, అశాస్త్రీయమైన, మూఢనమ్మకాలను ప్రేరేపించే విద్యను కేంద్ర ప్రభుత్వం అందించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే రాజ్యాంగ వ్యతిరేక విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వ విశ్వ రూపం ప్రజలందరికీ తెలిసిందని అన్నారు. రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్టు నాశనం చేస్తుందని విమర్శించారు. భారత రాజ్యాంగం మౌలిక లక్షణాలను ప్రజలందరూ గ్రహించి వాటినీ కాపాడుకునే విధంగా కృషి చేయాలని కోరారు. అదే సందర్భంలో విద్యార్థులందరూ తమ పుస్తకాలతో పాటు భారత రాజ్యాంగాన్ని కూడా అధ్యయనం చేయాలని, అప్పుడే రేపటి సమాజం రాజ్యాంగ విలువలతో బతుకుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్ఎఫ్ఐ నాయకత్వానికి పది రోజులపాటు అన్నమయ్య జిల్లాలో విద్యా వైజ్ఞానిక శిక్షణాతరగతులు ఏర్పాటు చేశామని, అత్యంత విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించేందుకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, ఎ.అశోక్, జిల్లా, అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, డి.రమణ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మహానాడు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డిజిపి

మహానాడు ఏర్పాటును పరిశీలిస్తున్న డిజిపి హరీష్ గుప్తా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 27, 28, 29వ తేదీలలో చింతకొమ్మదిన్నె పరిధిలోని పబ్బాపురంలో జరగనున్న మహానాడు నేపథ్యంలో రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, అడిషనల్ డిజి (లా అండ్ ఆర్డర్) ఎన్.మధుసూదన్ రెడ్డి శనివారం వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వేదిక, ఫుడ్ కోర్టుల వద్ద చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు సూచించారు. మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. కర్నూలు రేంజ్ డాక్టర్ కోయ ప్రవీణ్, అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షెముషి బాజ్ పేయి, ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్, కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, అన్నమయ్య జిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు, నంద్యాల జిల్లా ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా, అనంతపురం ఎస్‌పి పి.జగదీశ్, గుంతకల్ రైల్వే ఎస్‌పి రాహుల్ మీనా, అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లా, ఇతర జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందిస్తున్న బివైఎస్ నాయకులు

ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలి : బివైఎస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని పలు ప్రయివేట్ ఆస్పత్రులలో జరుగుతున్న నిలువు దోపిడీని అరికట్టి ప్రజలకు న్యాయం చేయాలని బహుజన యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రయివేట్, కార్పొరేట్, ప్రభుత్వ ఆస్పత్రులలో జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్, ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రజలను నిలువుగా దోపిడీ చేస్తున్నారని అన్నారు. ప్రజలు చేతులెత్తి మొక్కే దేవుళ్లు డాక్టర్లేనని, అలాంటి డాక్టర్లు ప్రజలకు సేవ చేయాల్సింది పోయి, వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా హోదా కలిగిన మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి 10 గంటలు దాటితే ప్రజలకు అడ్మిషన్లు గానీ, వైద్య చికిత్స గాని దొరకకపోవడం ప్రజల దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పది గంటలు దాటితే డాక్టర్ లేరంటూ వేరే ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారని అన్నారు సబ్ కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బహుజన్ యువసేన విఒఎస్ తరపున ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో బివైఎస్ నాయకులు హరికృష్ణ, శ్రీనివాసులు, శశి కుమార్, జిలాని బాషా, వినయ్, మహేష్, కుమార్, ఉదయ్, షరీఫ్, శశి, దేవేష్, శాండీ, బాలు, సాదిక్, హరి, సోము, మురళి, వేణు పాల్గొన్నారు.

ఐటిఐ అభ్యర్థులకు ధ్రువీకరణ తప్పనిసరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 26వ తేదీ లోపు తప్పనిసరిగా సర్టిఫికెట్లు ధ్రువీకరణ చేయించుకోవాలని ప్రభుత్వ ఐటిఐ జిల్లా కన్వీనర్ , రాజంపేట ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రఘురామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు దగ్గరలోని ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సర్టిఫికెట్లు ధ్రువీకరణ చేయిం చుకోవాలని లేని యెడల మెరిట్ లిస్టులో అభ్యర్థుల పేరు సూచిం పబడదని తెలిపారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న ఐటిఐ అభ్యర్థులు తప్పనిసరిగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రత్యేక అవసరాలున్న పిల్లల గుర్తింపు, నమోదు కోసం డ్రైవ్ 13 నుంచి నుండి జూన్ 6వ తేదీ వరకు సర్వేను నిర్వహించడం జరుగుతోందని సహిత విద్యా సమన్వయకర్త టి.బాలాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో భాగంగా మండలంలోని ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి సూచనల మేరకు మండలంలోని 6 నుంచి18 సంవత్సరాల గల విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు ఆవాస ప్రాంతాలలో సర్వేను పకడ్బందీగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐఆర్‌పి, టీచర్లు బాలాజీ,మానసలు మాట్లాడుతూ డిఇఒ సుబ్రహ్మణ్యం,జిల్లా దివ్యాంగుల విద్య కో-ఆర్డినేటర్ జనా ర్ధన్ ఆదేశాలు మేరకు మండలంలో సుడిగాలి పర్యటన చేసి దివ్యాంగ పిల్లలను గుర్తించి,వారి తల్లిదండ్రులతో వారికి విద్యతోపాటు, మానసిక చైతన్యం, ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని స్థానిక దేవళంపేటలో వెలసిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయానికి అనుసంధానంగా నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని శనివారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వేద పండితుల శ్రీ వల్లి సుబ్రహ్మణ్యంస్వామి కల్యాణోత్సవాన్ని రాళ్లపల్లి సురేంద్ర, రాళ్లపల్లి స్వరూప, వారి కుమార్తె లిపికా చౌదరి, కుమారుడు లలిత్ ప్రణవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకమిటి సభ్యులు తెలిపారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డితో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో పేదలైన ధనికులైన వివాహం చేసుకోవడానికి కల్యాణమండపం లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలలో వివాహాలు జరుపుకునే దుస్థితి ఉండేదని అన్నారు. ప్రస్తుతం కల్యాణ మండపం నిర్మించడంతో కలకడ మండల ప్రజల అందుబాటులో ఉంటుందన్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించిన దాత రాళ్లపల్లి సురేందర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. మంచి పనులు కార్యక్రమాలు నిర్వహించడానికి ఇలాంటి దాతలు భవిష్యత్తులో ముందుకు రావాలని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కల్యాణ మండపం నిర్మాణానికి సుమారు ఒక కోటి 20 లక్షలు ఖర్చు అయిందని ఆలయ కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమనాయుడు, మల్లికార్జున నాయుడులు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సర్పంచ్ విశ్వనాథ నాయుడు, వెంకటరమణ (పెద్దోడు) కమలనాథ, శ్రీనివాసులు రెడ్డి, బాబు రెడ్డి, చంద్రమోహన్, త్యాగరాజు, రెడ్డిశేఖర్‌నాయుడు, రమేష్‌నాయుడు, ఎం.జిలా నిబాషా తదితరులు పాల్గొన్నారు.

పొలంలో వాలుకు అడ్డంగా దుక్కులు దున్నతున్న రైతు

వాలుకు అడ్డంగా దుక్కులు చేయాలి : ఎఒ

ప్రజాశక్తి-రామాపురం

భూమిని వాలుకు అడంగా దుక్కులు చేయడం వల్ల వర్షపునీరు భూమిలోకి ఇంకిపోతాయని మండల వ్యవసాయ అధికారిని నాగమణి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేయు రైతులు ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల వర్షాలు వస్తున్నాయని అన్నారు. రైతులు భూమిని వాలుకు అడ్డంగా దుక్కులు చేయడంవల్ల వర్షపు నీరు భూములకి ఇంకిపోతాయన్నారు. భూమి సారవంతం అవడానికి పిల్లిపిసరా, అట్లు, జీలుగు అలాంటి కలిపి దుక్కులు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో వ్యవసాయ శాఖ వారిని సంప్రదించి కొనుగోలు చేయడం మంచిదని అన్నారు. విత్తన శుద్ధి తప్పక చేయాలని ఆమె రైతులకు సూచించారు.

మాజీ సిఎం విస్తృత పర్యటన

ప్రజాశక్తి- కలకడ

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మండలంలో విస్తృతంగా పర్యటించారు. బాటవారిపల్లె పంచాయతీ గరుడప్పగారిపల్లికి చెందిన ఇంజేటి భాస్కర కుమారుడు శివప్రసాద్, మాలతిలకు ఇటీవల వివాహమైన నూతన దంపతులను ఆశీర్వదించారు. కలకడ మాజీ సర్పంచ్ ఫైరోజ్, షబ్బీర్‌అహ్మద్ తనయుడు షహబాజ్ ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకుని పరామర్శి ంచారు. బాలయ్యగారిపల్లి పంచాయతీకి చెందిన వై.వెంకటరమణ టీచరు వారి కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై అతని భార్య శారద మృతి చెందింది. ఈ సంఘటనలో గాయపడి కోలుకున్న వెంకటరమణ, అతని కుమార్తె కీర్తనలను పరామర్శించి ఆరోగ్యం గురించి వాకబు చేసారు. కార్యక్రమంలో మాజీ సీఎం తనయుడు నిఖిల్‌కుమార్‌రెడ్డి ,మాజీ ఎంపిపి మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ విశ్వనాథ నాయుడు, శ్రీనివాసులురెడ్డి, బివి స్వామి విశ్వనాథ శెట్టి పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని కొమ్మనివారిపల్లి పంచాయతీ కె.అగ్రహారం గ్రామంలో శ్రీఎల్లమ్మతల్లి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో అమ్మ వారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కూడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞానికి విరాళం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని మల్లూరు గ్రామంలో కొత్తపల్లె మల్లూరమ్మ గుడి వద్ద జరుగుతున్న మహాభారతం కార్యక్రమానికి మండిపల్లి రాహుల్‌రెడ్డి శనివారం రూ.11 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన సేవాభావాన్ని ప్రశంసించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ సాయం చేసినం దుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరవధిక దీక్ష విరమణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గుంజన ఏటికి రక్షణ గోడ నిర్మించాలంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్‌అహ్మద్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శిబిరానికి పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విచ్చేసి సంఘీభావం తెలిపారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డితో ఫోన్‌లో చర్చించారు. రక్షణ గోడకు పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ముక్కా హామీ ఇవ్వడంతో సయ్యద్ అహ్మద్ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. పది రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే కాంగ్రెస్ పార్టీ కేడర్ మొత్తం దీక్ష చేస్తామని చెప్పారు. సమస్య చిన్నదైన సమిష్టిగా పరిష్కానికి కృషి చేయడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని అన్నారు. గుంజననది ఏటి గోడను త్వరగా ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు ఇన్‌చార్జి గోసాల దేవి, రాష్ట్ర ఎస్‌సిసెల్ కన్వీనర్ శాంతయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. చంద్రశేఖర్, కాంగ్రెస్‌పార్టీ మదనపల్లి ఇన్‌ఛార్జి రెడ్డిసాహెబ్ పాల్గొన్నారు.

నిరవధిక దీక్షను విరమింపజేస్తున్న తులసిరెడ్డి

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాట్లాడుతున్న వార్డు సభ్యులు నాగేశ్వరరావు

గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలంటూ వార్డు సభ్యులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం కోడూరు గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 12వ వార్డు సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ తన వార్డులో గత ఏడాదిగా పలు సమస్యలు పరిష్కరించలేక పోతున్నామని ప్రజలు వేలెత్తి చూపుతున్నారని అన్నారు. నెలలోగా తన వార్డు పరిధిలో సమస్యలు పరిష్కరించకపోతే సభ్యత్వానికి రాజీనామా చేసి నిరాహార దీక్ష చేపడతానని పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందించారు. 8వ వార్డు ప్రాంతంలో చెత్త సేకరణకు వాహనాలు రావడం లేదని దీని వలన చెత్త పెరిగిపోయి దుర్గంధం ఎదగల్లుతోందని, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వార్డు సభ్యులు పి సుజాత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశాలు నిర్వహించేది సంతకాలు పెట్టేందుకేనా సమస్యలు పరిష్కరించరా అంటూ అధికారులను నిలదీశారు. పంచాయతీ ఇఒ ప్రసాద్ రావు మాట్లాడుతూ గతంలో జరిగినది వదిలి ఇకముందు జరగబోయే దాని గురించి ఆలోచించి వార్డు సభ్యులందరూ ఏకాభిప్రాయంతో అవసరమైన పనులను ఆమోదిస్తే నిధులను బట్టి పనులు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని జూన్ 1వ తేదీ నుంచి ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. సభ్యుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడిగి శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'సైనిక్' స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు

'శ్రీభువన' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-పీలేరు

ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో పీలేరు శ్రీ భువన విద్యాలయానికి చెందిన 13 మంది విద్యార్థులు 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు శ్రీభువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమారమాదేవి, ప్రిన్సిపల్ వరలక్ష్మి తెలిపారు. విద్యార్థులు కె.అచ్చుత్ కుమార్‌రెడ్డి, వి.అక్షరరెడ్డి, వి. శ్రీదేవి, జి. హిమాన్షు, ఎస్.రయాన్, వి.తన్విరెడ్డి, ఎన్. యస్వంత్, డి.అశ్వంత్ కార్తికేయ, జి. తనుష్, ఆర్.హర్షవర్ధన్, ఎం. హవ్యాస్, బి. ఇంద్రేష్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 5వ తరగతి చదివిన విద్యార్థులు సైనిక్ ప్రవేశ పరీక్షకు శిక్షణ తీసుకుని ఈ ఘనత సాధించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ విజయానికి తోడ్పడిన పాఠశాల బోధన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు ఇలాంటి ఘనత సాధించాలని ఆకాంక్షించారు.

అర్హత సాధించిన విద్యార్థులకు మాజీ సిఎం అభినందన

కలికిరి : సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన శాంతినికేతన్ సైనిక్ కోచింగ్ సెంటర్ విద్యార్థులను మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందించాడు. సైనిక్ ప్రవేశ పరీక్షలు 12మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మార్కులు సాధించిన సందర్భంగా శాంతినికేతన్ కోచింగ్ సెంటర్లు విజయోత్సవసభ నిర్వహించారు. ప్రిన్సిపల్ శివకుమార్‌తో పాటు విద్యార్థులు కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన ర్యాంకులు సాధించిన విద్యార్థులు అనురాగ్‌రెడ్డి, పి రిథాన్ పాంచ జన్యరెడ్డి, భావన, పురుషోత్తం, గణేష్‌యాదవ్, నేహా, నయో నందా షాబాన్, సుధాకర్, ధార్మిక్ సుజిత్ సాయి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ప్రతాప్, ఇఎస్ రేవతి, ఎస్ షాహినా, సుమతి, కె.జయశ్రీ, ఎస్.షాహినా, ఆనందబాబు, ఎన్ అశ్విని, ఎం.ఆంజనేయులు, దీప్తి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని కోటిరెడిగారిపల్లె వద్ద గల గిజుభాయి బాలభవన్‌లో చదువుతున్న మలిగివారిపల్లికి చెందిన కరుణాకర్‌రెడ్డి, సునీతల కుమార్తె జి.మైథిలి సైనిక్ ప్రవేశ పరీక్షలు సత్తాచాటి ర్యాంకును కైవసం చేసుకుంది. సైనిక్‌స్కూల్ ప్రవేశానికి అర్హత సాధించింది. ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి మాట్లాడుతూ మండల విద్యార్థిని సైనిక్ పాఠశాలకు ఎంపిక కావడం అభినందీనమన్నారు. గిజుభాయిబాలభవన్ యాజమాన్యం, విద్యార్థుల కృషిని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.మైథిలిని మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

మదనపల్లి: మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయులు

రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యావసర సరు కులు పంపిణీ చేయాలని తహశీల్దార్ రామానుజులు పేర్కొన్నారు. స్థానిక తహశీ ల్దార్ కార్యాలయంలో శనివారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్ద పండగ వాతావరణం కనిపించాలన్నారు. రేషన్ కార్డుదారు లందరికి నిత్యవసర సరుకు లు పంపిణీ చేయాలని సూచించారు. ఉదయం 8 నుంచి 12 వరకు, సాయం త్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు డీలర్లు ప్రజలు అందు బాటులో ఉండాల న్నారు. వికలాంగులు, వృద్ధు లకు ఇంటి వద్దకే సరు కులు పంపిణీ చేయాలని సూచించారు. డిడిలు సకాలం లో చెల్లించాలని, నిత్యవ సర సరుకుల పంపిణీపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిటి కృపావతి, ఆర్ఐ సమద్ ఖాన్, డీలర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పాత విధానంలోనే రేషన్ షాప్ డీలర్లు ద్వారా నిత్యావసర సరకులు పంపిణి చేయడం జరుగుతుందని మదనపల్లె తహశీల్దార్ ధనుంజయులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్ర మం పైన ఇప్పటికే డీలర్లు అందరితో సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. డీలర్లు షాపులో కార్డుదారులకు అందు బాటులో ఉండి సకాలంలో నిత్యావసర సరకులు పంపిణి చేయాలన్నారు. ఇకపై కార్డు దారులు బియ్యం, సరకులు రేషన్ షాపుల్లోనే తీసుకోవాలని కోరారు. మదన పల్లె పట్టణం, రూరల్ నందు మొత్తం 101 రేషన్ షాపులు ఉన్నాయని వివరించారు. ప్రతి చౌక దుకాణంలో ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిటి పిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో కక్ష సాధింపులే అజెండా :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులే అజెండాగా పాలన సాగిస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను మోసం చేస్తోందన్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైసిపి నేతలు, కార్యకర్తలను వేధించడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేద న్నారు. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామస్థాయిలో పటిష్టమైన కమిటీలు ఉన్నప్పుడే పార్టీ బలపడుతుందని, కమిటీలలో ఉత్సాహంగా ఉన్నవారినే నియమించాలన్నారు. వైసిపి బలోపేతమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని, ఈ లక్ష్యంతోనే ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మార్కెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, నాయకులు చింతల శివానందరెడ్డి, అబ్దుల్ కలీమ్, కేశవరెడ్డి, చింతల రమేష్‌రెడ్డి, శివారెడ్డి, కమలాకర్‌రెడ్డి, నీళ్ల భాస్కర్, జయరామచంద్రయ్య, రవికుమార్‌రెడ్డి, మస్తాన్, పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

వాల్మీకిపురం : యోగాసనాలు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రోజు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుందని ఎంపిడిఒ మనోహర రాజు అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో యోగాంధ్ర మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడికి గురవుతుంటారని, ఒత్తిడి నుండి పూర్తిగా ఉపశమనం పొందడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని, యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలసి యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి, ఎస్ఐ చంద్రశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ వెంకట్, ఇఒఆర్‌డి సుధాకర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రోహిణి, అరుంధతి పాల్గొన్నారు. **నందలూరు :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో ఈనెల 31వ తేదీన ఉదయం 8 గంటలకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా టూరిజం అధికారి నాగభూషణం పేర్కొన్నారు. ఈ జూన్ నెల 21వ తేదీన జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా జిల్లాలోని నాలుగు ప్రధాన పర్యాటక కేంద్రాల వద్ద యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి సునీల్ కుమార్ పాల్గొన్నారు. **కలికిరి:** మేజర్ పంచాయతీ కార్యాలయంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో యోగా ఆసనాలు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మనిషికి యోగా అనేది జీవితంలో ఒక భాగం అవ్వాలని అప్పుడే ఆరోగ్యంతో పాటు ఆనందం కూడా లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పంచాయతీ సిబ్బంది, టిడిపి యువ నాయకుడు యోగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం : మంత్రి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఈ నెల 27, 28, 29వ తేదీలలో కడపలో నిర్వహించే మహానాడు సందర్భంగా ప్రజలకు ప్రయాణ సమస్యలు తలెత్తకుండా అవసరం మేరకు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డితో కలిసి ప్రజలకు రవాణా సౌకర్యంపై ఆర్‌టిసిఅధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో నిర్వహించే మహానాడుకు రాష్ట్రం నలు మూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అవసరం మేరకు బస్సులు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొట్ట మొదటిసారిగా కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం

ప్రజాశక్తి-అట్లూరు

పహల్గాం ఉగ్రదాడి ఖండిస్తూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా మతసామరస్యం–దేశ సమగ్రత పరిరక్షణక సమైక్యతా యాత్రలు చేపట్టాలని ముద్రించిన కరపత్రాలను సిపిఎం అట్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఇ.రమణయ్య మాట్లాడుతూ పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఏప్రిల్ 22వ తేదీన పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 26 మంది పర్యాటకులు బలైపోయారని, పర్యాటకులను వారి మతాన్ని అడిగి తెలుసుకుని హత్య చేయడం ద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజనను తీసుకుం వాలని పన్నాగం వేశారని అన్నారు. కొన్ని శక్తులు ఉగ్రవాదానికి మతంతో ముడేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని, ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని వదిలేసి వక్రబుద్ధితో మతోన్మాదాన్ని, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టి దేశాన్ని బలహీన పరుస్తున్నారని అన్నారు. ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని అన్నారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రవిచంద్ర, చిన్నగోపయ్య, మస్తాన్, షాహినా పాల్గొన్నారు.

టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

మహానాడుకు సిద్ధం కండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలకడ

మహానాడు సభకు మండలంలోని కార్యకర్తలు, అభిమానులు సిద్ధం కావాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కలకడ సమీపంలో ఉన్న దేవళం ఎటలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27,28, 29 తేదీలలో కడపలో జరుగునున్న మహానాడుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, నల్లారి అభిమానులు, అధిక సంఖ్య వాహనాలలో బయలుదేరాలని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్, పార్టీ కున్న ఆదరణ, అభిమానం, అభిమానులు ఎంతమంది ఉన్నది నిరూపించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త, మహానాడు సభకు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండలంలోని గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సర్పంచ్ విశ్వనాథ నాయుడు, బరకం శ్రీనివాసులురెడ్డి, కమలనాథ వెంకటరమణ (పెద్దోడు) మల్లికార్జుననాయుడు, మద్దిపట్ల వెంకటరమనాయుడు, పాల్గొన్నారు.

26న బిసి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్ : జాతీయ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఆర్ కృష్ణయ్య జనగణనతోపాటు కులగణన జరపాలని లోకసభలో కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందేలా పోరాడారు. ఈ సందర్భంగా ఈ నెల 26న బిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సందు శివనారాయణ తెలిపారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ఆర్ కృష్ణయ్య, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి యలగాల నూకనమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకటరమణ రాజు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కత్తి విజయకుమార్, జాయింట్ సెక్రెటరీ రమేష్ రాజు, కోశాధికారి రామసుబ్బ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ,పుల్లయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మహావీర్ మ్యూజియాన్ని సంరక్షించండి

ప్రజాశక్తి - కడప :శిథిలావస్థకు చేరుకున్న మహావీర్ మ్యూజియాన్ని సంరక్షించాలని కొండా పాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండ సుబ్బయ్య కోరారు. శనివారం ఆయన మ్యూజియాన్ని సందర్శించారు. కడప రైల్వేస్టేషన్ వద్ద 1982లో ఇక్కడ శ్రీ భగవాన్ మహావీర్ మ్యూజియాన్ని ప్రారంభించారన్నారు. ప్రస్తుతం అక్కడ నూతన కలెక్టరేట్ ఉందన్నారు. దాదాపు 43 ఏళ్లు కావస్తున్న ఇలాంటి మ్యూజియం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎంతో విలువైన వస్తువులున్నాయని, వాటిని ప్రజలు, విద్యార్థులు తిలకించడానికి దారి కూడా లేదన్నారు. కలెక్టర్ మ్యూజియాన్ని సం దర్శించాలని సూచిం చారు.కార్యక్ర మంలో ఆర్కే కరీం సేవా సమితి అధ్యక్షులు రాయల్ అబ్దుల్ కరీముల్లా, మ్యూజి యం సిబ్బంది పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కడప వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో సంఘ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ పాల నలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకై ఉపాధ్యాయ సంఘనా యకులు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయడంతో బాటు రాష్ట్ర పతి ఆమోదం కూడా పొందిన విషయాన్ని గుర్తు చేశారు. నాటి కమిటీలో తాను సభ్యుడిగా పనిచేసినట్లు తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం ద్వారా విద్యారంగం బలోపేతం కావడం తో బాటు ఏళ్లతరబడి పదోన్నతులకు నోచుకోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పదోన్నతులు పొందుతారని, జాప్యం లేకుండా అమలుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంతో కాలంగా తాము డిమాండ్ చేసిన శాశ్వత టీచర్ల బదిలీల చట్టం అమలులోకి తేవడం హర్షణీయమని చెప్పారు. పారదర్శకంగా, లోపాలు లేకుండా అమలు చేయాల న్నారు. సమావేశంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా, ప్రధాన కార్య దర్శి సంగమేశ్వరరెడ్డి, జిల్లా మున్సిపల్ కన్వీనర్ వై.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

28 నుంచి నూజివీడు క్యాంపస్‌లో పత్రాల పరిశీలన

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు క్యాంపస్‌లో ఈనెల ఈనెల 28 నుంచి 31 వరకు ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నట్లు రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల కింద ప్రతి రోజు సర్టిఫికెట్లను ధృవీకరిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో ఏదైనా ప్రత్యేక కేటగిరికి అప్లై చేయడం మర్చిపోయిన విద్యార్థులు కూడా ధృవీకరణకు హాజరయ్యే అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు తమకు కేటాయించిన తేదీన ఆయా ప్రత్యేక కేటగిరికి చెందిన సర్టిఫి కెట్లును తీసుకొని తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. 28న సిఏపి కింద 153 మంది, స్పోర్ట్స్ కింద 320 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తామన్నారు. 29న సిఏపి కింద 117, బిఎస్‌జి కింద 247, ఎన్‌సిసి కింద 341, స్పోర్ట్స్ కింద 245 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు, 30న ఎన్‌సిసి కింద 452, స్పోర్ట్స్ కింద 467 మంది సర్టిఫికెట్లు, 31న ఎన్‌సిసి కింద 661 మంది విద్యార్థులు సర్టిఫికెట్లను పరిశీలిస్తామని వివ రించారు. 2103 మంది విద్యార్థులు ప్రత్యేక కేటగిరీ కింద ట్రిపుల్‌ఐటి సీట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారి సర్టిఫికెట్లును నాలుగు రోజులపాటు పరిశీలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

క్రైం కార్నర్

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ టికె.తులసి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం వైకోట గ్రామంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది దాడులు జరిపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వైకోట గ్రామానికి చెందిన బొబ్బే సుబ్బయ్య వద్ద నుంచి పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. నాటు సారా తయారీ నిల్వ రవాణా విక్రయాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించి తమ ప్రాంతాలలో నాటుసారా నుంచి విముక్తి చేయడంలో భాగస్వాములు కావాలని సిఐ కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, శ్రీనివాసులు, సిబ్బంది జి.బసిరెడ్డి, వై మధుసూదన్ రాజు, పి సోమేశ్వర్ పాల్గొన్నట్లు తెలిపారు

నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సిఐ తులసి,సిబ్బంది